# దమయంతి

దమయంతి సుగుణాలరాశి. అపురూప సౌందర్యవతి. కీర్తి ప్రతిష్ఠలతో విదర్భ దేశాన్నేలుతున్న భీముని కుమార్తె. శుభ లక్షణాలన్నీ ఆమెలోనే చోటు చేసుకుని మిగతా రాజ కన్యలందరి కన్నా మిన్నగా ఉండటంతో, అందరి నోటా దమయంతీ రూప వర్ణనమే వినవచ్చేది. ఆమెను వివాహ మాడాలని కాంక్షించని రాజకుమారుడు లేడంటే అతిశయోక్తి కాదు.

ఎందరో రాజకుమారులు దమయంతిని వివాహ మాడాలనే కోరికను విదర్భ రాజుకు తెలియపరచినా, దమయంతి ఏలాంటి ఉత్సాహమూ కనబరచ లేదు. దానికి కారణం అప్పటికే ఆమె మనసులో నిషధ రాజయిన నలునిపైన అభిమానం ఏర్పడటమే.

నలుడు మహా పరాక్రమవంతుడుగా, ప్రజా రంజకుడుగా, నవ మన్మథా కారుడుగా పేరు పొందాడు. ఆ నోట ఆ నోట నలుని రూప గుణ కీర్తన దమయంతి చెవిని సోకింది. నలమహారాజును చూడకపోయినా, అతనిపైన అప్రయత్నంగా దమయంతి అనురాగం అంకురించింది.

యౌవనవంతుడైన ఆ నిషధ రాజును వరించడానికి ఎందరో రాజకన్యలు సిద్ధంగా ఉన్నా దమయంతీ రూప, సౌందర్యాలు విన్న నలుని మనసులో ఆమె రూపమే నిలిచిపోయింది. దమయంతి ఊహాచిత్రం నలుని మనసులో స్థిరపడి పోవడంతో, అతను మరే రాచకన్య గురించీ ఆలోచించలేకపోయాడు.

దమయంతి రూపవైభవాన్ని తలపోస్తూ నల మహారాజు అనాడు ఉద్యాన వన విహారం చేస్తున్నాడు. ఆకాశంలో వరుసలు తీరి విహరిస్తున్న తెల్లని రాజ హంసలు అతనికి ఎంతో ముచ్చట గొల్పాయి. నల మహారాజు వాటిని తిలకిస్తుం డగానే అవి ఉద్యానవనంలో నేలపైన వాలాయి. వాటి తెల్లని, సున్నితమైన రెక్కల్ని స్పృశించాలని, వాటిని ఒడిలోకి తీసుకోవాలని కోరిక కలిగిన నిషధ రాజు వాటిని నెమ్మదిగా సమీపిస్తుండే అన్నీ దూదిపింజల్లా ఆకాశంలోకి ఎగిరి పోయాయి.

ఒక్కటి మాత్రం సహజమైన వయ్యారపు నడకల సొగసుతో ముందుకు అడుగులు వేస్తుంటే, వేగంగా నలుడు దాన్ని చేజిక్కించుకున్నాడు.

దమయంతి హంసయాన అయి ఉంటుందని భావిస్తూ ఆ రాజహంసని ఒడిలోకి తీసుకుని, గుండెలకి హత్తుకున్నాడు నల మహారాజు.

ఆ స్వేచ్ఛా విహంగం, గగనవీధికి ఎగిరిపోవాలనే తొందరతో, రాజు తనని బంధించాడనే భయంతో, బెదురుతూ ఆయన వంక చూసింది. ఆ దివ్య హంసకి నల మహారాజు గురించి తెలుసు. అతనికి ప్రీతికరమైన దేదయినా చేసి, ఎగిరిపోవాలని అనుకుంది.

"మహారాజా, విదర్భ రాజకుమార్తె దమయంతిపై నీ మనసు లగ్నమయిందని నాకు తెలుసు. ఆ దమయంతి ఎట్లా ఉంటుందో నాకు తెలుసు. ఆమె చిత్రాన్ని గీసి నీకు చూపిస్తా. నన్ను దయదలచి విడిచిపెడితే ఆమె దగ్గరికిపోయి నీ మనోభావం ఆమెకు తెలియజేస్తా" అంది.

మనుష్య భాషలో హంస మాటలు మధురంగా వినిపిస్తుంటే, ఆ హంసను వరప్రసాదినిగా భావిస్తుండగానే, దమయంతి రూపం చిత్రించింది ఆ రాజహంస. నల మహారాజు తన్మయత్వం నుంచీ, విస్మయం నుంచీ తేరుకునే లోపలే "నా రెండో వాగ్దానం నిలబెట్టుకుంటా" నని నలుని ఒడిలోనుంచి రివ్వున ఎగిరిపోయింది రాజహంస.

విదర్భ రాజకుమార్తె ఉద్యానవనంలో దిగింది రాజహంస. ప్రపంచాన్నే మరిచిపోయి స్వేచ్ఛగా తిరుగుతున్నట్లున్న హంసని దమయంతి, చెలికత్తెలు చూశారు. పట్టుకోబోయారు. ఎవరి చేతికీ చిక్కక, అటు ఇటు తిరిగి దమయంతి చేతికి పట్టుబడింది ఆ రాజహంస.

ఎక్కువ శ్రమ లేకుండా లొంగిపోయిన రాజహంసని విజయగర్వంతో వొడిలోకి తీసుకుని ముద్దు చేసింది దమయంతి.

నెమ్మదిగా దమయంతి చెవులకి వినపడేలా మరీ దగ్గరగా చేరి, "నువ్వు నల మహారాజుని ప్రేమిస్తున్నావు కదూ?" అంది.

దమయంతి ఆనందాశ్చర్యాలతో ఉక్కిరిబిక్కిరై సిగ్గుతో తల వంచింది.

నల మహారాజు అందాన్ని వర్ణించి చెప్తుంటే, దమయంతి పరవశిస్తోంది. ఆమె మనసు కనిపెట్టిన రాజహంస నలుని చిత్రపటాన్ని గీస్తుంటే, ఆశ్చర్యంతో ఆప్యాయంగా ఆ హంసని గుండెలకి హత్తుకుంది దమయంతి.

"నల మహారాజుకి నీ విషయం విన్నవించనా?" అంది గోముగా.

దమయంతికి ఒక్కసారి ముఖాన స్వేద బిందువులు నిండాయి. శరీరం గగుర్పాటు చెందింది. ఏదో భయం ఆవరించింది. ఆ మహారాజు తనను గూర్చి ఏమనుకుంటాడో, అతని మనసు ఏ రాచకన్య పైన నిలిచిందో, తన తండ్రి అంగీకరిస్తాడో లేడో- దమయంతి ముఖంలో భయాందోళనలు గమనించింది హంస.

"నేను నల మహారాజు దగ్గర నుంచే వస్తున్నా, ఆ మహారాజు నీపైన మరులుగొని విరహతప్తు డవుతున్నాడు. నీ మనసు ఆయనపైనే ఉందని తెలుస్తే నేను వెళ్ళి ఆ మాట చెప్తాను."

దమయంతికి రాజహంస మాటలు మధురంగా వినిపిస్తున్నాయి. దాని మెత్తని రెక్కల్ని మృదువుగా తాకుతూ, దాని కళ్ళలోకి చూస్తూ, చిరునవ్వు నవ్వింది.

"నీ కోసం నలుణ్ణి, నలుని కోసం నిన్ను పుట్టించాడు బ్రహ్మ. నాకు తెలుసు." రాజహంస దమయంతి ఒళ్ళో ఒదిగిపోతూ అంది. "నీకు అంగీకారమేనా?" అంది రెట్టిస్తూ.

వాచ్యంగా తన అంగీకారం చెప్పడానికి సిగ్గు అడ్డుపడుతుంటే, ముసి ముసిగా నవ్వుకుంటూ తల ఊపింది దమయంతి.

దమయంతి చెక్కిళ్ళను తన రెక్కలతో ఒక్కసారి నిమిరి, రివ్వున ఎగిరిపోయింది రాజహంస.

నల దమయంతు లిద్దరూ ఒకరిపై నొకరు అనురాగం పెంచుకుంటూ, మన్మథ తాపానికి లోనౌతూ, సందర్శన భాగ్యం కోసం ఎదురుచూస్తూ, ఉద్యాన వన విహారం చేస్తూ కాలం గడుపుతున్నారు.

రాజహంస వచ్చి వెళ్ళినప్పటి నుండి దమయంతిలో కలిగిన మార్పును గమనిస్తూనే ఉన్నారు చెలికత్తెలు. విదర్భ రాజుకు దమయంతి విరహ వేదనను

తెలిపారు. నిషధ రాజ్యమంటే సదభిప్రాయ మున్న భీముడు, అతన్ని ఎట్లా రప్పించి దమయంతితో వివాహం జరిపించాలా అని ఆలోచించాడు. వంశాచారం ప్రకారం స్వయంవరం ప్రకటించాల్సిందే.

దమయంతీ విరహతప్తుడైన నల మహారాజుకు స్వయంవర ప్రకటన పన్నీటి జల్లు అయింది.

త్రిలోక సౌందర్య రాశి అయిన దమయంతిని గురించీ, ఆమె స్వయం వరం ప్రకటన గురించీ నారదుని ద్వారా విన్నారు ఇంద్ర దేవతలు. ఆ స్వయంవరం తిలకించాలనే ఉత్సాహంతో బయలుదేరినవారు, మార్గ మధ్యంలో మరో మన్మథునిలా ఉన్న నిషధ నలుని చూశారు.

నలదమయంతుల ప్రేమానురాగాలు వారికి తెలిశాక చిత్రమైన కోరిక కలిగింది వారికి. వారి ప్రేమని పరీక్షించాలనే భావం ఆ నిమిషంలోనే దేవతలకి తోచింది.

ఐతే, దివ్య హంస చెప్పిన మాటలు నల మహారాజు చెవిలో మారుమోగు తున్నాయి. తన ప్రేమ పవిత్రమైనదైతే ఆ ప్రేమకి ఓటమి ఉండదని నలునికి తెలుసు.

స్వయంవర మంటపం సభాసదులతో కిటకిట లాడుతోంది. ఇంద్ర, వరుణ, అగ్ని, యములు స్వయంవర మంటపంలో ఆసీనులయ్యారు.

దమయంతి పూలహారంతో మంటపంలోకి అడుగు పెట్టింది. ఆమె కళ్ళ ముందు ఐదుగురు నల మహారాజులు కనిపిస్తున్నారు. కానీ నిషధ రాజయిన నలమహారాజును గుర్తించేదెలా? క్షణంలో దమయంతి ముఖంలో భయాందోళ నలు మాయమయ్యాయి. దివ్యహంస మాటలు అమె చెవుల్లో మారుమోగుతున్నాయి.

నిశ్చలమైన సంకల్పానికి, పవిత్రమైన ప్రేమకి దైవం తోడ్పడుతుంది కదా! దేవతల అనుగ్రహాన్ని కోరుకుంటూ అడుగు అడుగు ముందు కేసింది దమయంతి.

దేవతల నేలని ఆనని పాదాలు, అనిమిషత్వం వారిని నలమహారాజునుంచి వేరు చేస్తుంటే, దమయంతి మనసు ఆనందపరవశమైంది తన ప్రేమ మూర్తి నల మహారాజు మెడలో పుష్పమాలను అలంకరించి, క్రీగంట అతన్ని చూస్తూ నిలబడింది దమయంతి.

ప్రసన్నవదనాలతో మందహాసం చేస్తూ నలదమయంతుల్ని ఆశీర్వదించారు ఇంద్రాది దేవతలు.

మంగళ తూర్యనాదాలమధ్య నల దమయంతుల స్వయంవర వేడుకలు తిలకించా రక్కడి వారంతా. *

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం :
అరణ్య పర్వం : ద్వితీయాశ్వాసం)
(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక : 29-6-1988)